క్లుప్తంగా

విధిగా పన్నులు చెల్లించండి

డీటీ విజయేందర్



ధారూరు: మోమిన్‌ఖుర్దు గ్రామ సభలో పాల్గొన్న డీటీ విజయేందర్

ధారూరు: ప్రతిఒక్కరూ గ్రామ పంచాయతీకి విధిగా పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ధారూరు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ ప్రజలకు సూచించారు. ధారూరు మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని, విద్యుత్ లైన్‌కు ఆన్‌ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయించాలని ఆయన కార్యదర్శికి సూచించారు. ప్రతి ఇంటి నుంచి విధిగా చెత్త సేకరించాలని ఆయన పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు



బొట్యానాయక్ తండాలో ఏర్పాటు చేసిన గ్రీన్ షేడ్ నెట్

కుల్కచర్ల: నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం 'సాక్షి' దినపత్రికలో 'మండేకాలం నర్సరీల భద్రం' మొక్కల పెంపకంలో అధికారుల నిర్లక్ష్యం అనే శీర్షికన కథనాన్ని ప్రచురించారు. దీనికి స్పందించిన అధికారులు ఎంపీడీఓ రామకృష్ణ గురువారం పీరంపల్లి, బొట్యానాయక్ తండా గ్రామ పంచాయతీలకు వెళ్లి షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేయించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన గోరిగడ్డ తండా పంచాయతీ కార్యదర్శి ఖురుద్దిన్‌కు, ఫీల్డ్ అసిస్టెంట్ భీమయ్యకు మెమో జారీ చేశారు. 3రోజుల్లో సంజాయిషీ ఇచ్చుకోవాలని మెమోలో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తిమ్మాయిపల్లిలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న సత్తయ్య

దోమ: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల అధ్యక్షుడు సత్తయ్య పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. గురువారం దోమ మండల పరిధిలోని తిమ్మాయిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేతి పంపులను, సింగిల్‌ఫేస్ మోటార్లను మరమ్మతులు చేయించాలన్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలను అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్, రమేశ్, వెంకటేశ్, రాములు, చింటూ, శ్రీశైలం, వినయ్‌కుమార్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఎంపీడీఓ గ్యామా



శివారెడ్డిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ గ్యామా తెలిపారు. గురువారం దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లి నర్సరీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి ఎప్పటికప్పుడు నీరు పెట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నర్సరీ నిర్వహణను బాధ్యతతో చూసుకోవాలన్నారు. కూలీలతో ప్రతీ రోజు నీరు పట్టిస్తూ మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పేరుకే దుద్యాల్ పోలీస్ స్టేషన్!

- మూడు నెలలు గడుస్తున్నా ప్రారంభంకాని సేవలు
- కేసుల నమోదు పాత పోలీస్ స్టేషన్లోనే
- అందుబాటులో లేని ఫర్నిచర్, కంప్యూటర్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



దుద్యాల్ పోలీస్ స్టేషన్

దుద్యాల్: మండల కేంద్రం ఏర్పడి దాదాపుగా మూడు సంవత్సరాలు కావస్తుంది. రెండు సంవత్సరాల వరకు మండలంలోనే రెవెన్యూ సేవలు మాత్రమే సాగుతుండేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దుద్యాల్ మండలం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అందులో భాగంగానే పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, విద్యాశాఖ, వ్యవసాయ శాఖలకు సంబంధించిన కార్యాలయాలు తాత్కాలిక భవనాల్లో ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. కానీ పోలీస్ స్టేషన్ ఏర్పాటై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ నేటికి సేవలు ప్రారంభం కాలేదు. పోలీస్ స్టేషన్ అంటే ఎస్ఐ, ఇతర సిబ్బంది ఉండి విధులు నిర్వహిస్తారు. కానీ ఇక్కడ కేసుల నమోదు వంటి కార్యకలాపాలు మాత్రం కొనసాగడం లేదు. పేరుకే పోలీస్ స్టేషన్ కానీ సేవలు మాత్రం పాత మండలంలోనే నిర్వహిస్తున్నారు. దుద్యాల్ మండల పరిధిలోని గ్రామాలకు సంబంధించి ఫిర్యాదులు అందితే ఇక్కడ అధికారులు పాత పోలీస్ స్టేషన్‌కే పంపిస్తున్నారు. మండలంలో పోలీస్ స్టేషన్ ఏర్పడిన కూడా కేసులు, ఫిర్యాదుల విషయంలో పాత పోలీస్ స్టేషన్‌కే వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో తాత్కాలిక భవనంతో ఏర్పడిన పోలీస్ స్టేషన్ సేవలు కూడా తాత్కాలికంగానే కనిపిస్తున్నాయని మండల ప్రజలు భహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. మండలంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసునున్నా ఆయా గ్రామాల పరిధిలోని పాత పోలీస్ స్టేషన్‌కే వెళ్లాల్సి వస్తుందని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో మొత్తం 21గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా, గొడవలు, ఘర్షణలు జరిగినా, ప్రమాదాలు సంభవించినా కేసుల నమోదుకు సంబంధించి పాతపోలీస్ స్టేషన్‌కే వెళ్లమని దుద్యాల్ పోలీసులు చెబుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో లేని సాంకేతిక సామాగ్రి

పోలీస్ స్టేషన్ ఏర్పాటై మూడు నెలలు గడుస్తున్నా నేటికి సాంకేతిక సామాగ్రి అందుబాటులో లేవు. ముఖ్యంగా కంప్యూటర్లు, ఫర్నిచర్ పూర్తి స్థాయిలో సమకూర్చుకోకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం**
>
> పోలీస్ స్టేషన్లో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ఉన్నతాధికారులు చాలా కృషి చేస్తున్నారు. దీనికి సంబంధించి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సాంకేతిక సమస్య వల్ల ఆలస్యం అవుతుంది. కేసుల నమోదు, డయల్ 100 వంటి సేవలను త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. మండల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతాం. కంప్యూర్లు, ఫర్నిచర్ వంటివి సర్ధుబాటు చేస్తాం.
>
> – శ్రీనివాస్, డీఎస్పీ, పరిగి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

వసతి గృహాలను పరిశీలించిన అధికారులు



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కొడంగల్: పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను జిల్లా అధికారులు గురువారం సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టళ్లకు వేసిన పెయింటింగ్, మరమ్మతు పనుల గురించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులతో సమావేశమై బాగా చదివి పరీక్షలు రాయాలన్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను ప్రతీ విద్యార్థి వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించేవిధంగా కృషి చేయాలని సూచించారు. భౌతిక శాస్త్రం ప్రాధాన్యతను వారు వివరించారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించి విద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారులు మల్లేశం, కమలాకర్‌రెడ్డి, కొడంగల్ వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాసుల అందజేత



బస్‌పాస్‌లు అందజేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ అశోక్‌ముదిరాజ్

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగనపల్లి అశోక్‌ముదిరాజ్ దివ్యాంగులకు గురువారం తన సొంత డబ్బులు వెచ్చించి ఉచితంగా బస్‌పాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధారూరు జీపీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించిందని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని దివ్యాంగులకు తన వంతు సహాయంగా బస్‌పాసులను అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దివ్యాంగులకు అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అంజనాయక్, కాంగ్రెస్ మండల నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, తిరుపతిగారి మల్లేశ్, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కల్వ కిరణ్‌కుమార్, ఆర్టీసీ బాధ్యుడు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు సబ్సిడీపై పరికరాలు

దరఖాస్తుకు ఈ నెల29 చివరి గడువు

దౌల్తాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించాయి. వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద 50శాతం సబ్సిడీపై మహిళా రైతులకు యంత్రాలను అందిచనుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి దౌల్తాబాద్ మండలానికి 37యూనిట్లు మంజూరయ్యాయి. దీనికోసం ఈ నెల 29వరకు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ లావణ్య తెలిపారు.

తొలగనున్న ఇబ్బందులు

గత ప్రభుత్వాలు యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా సన్న, చిన్నకారు మహిళా రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. సన్న, చిన్నకారు రైతులకు 40శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం సబ్సిడీ వర్తించనుంది. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్లు ఏఓ తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళ రైతులు దరఖాస్తు చేసుకోవాలని లావణ్య కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

కొడంగల్ రూరల్: 2024–25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల కోసం దరఖాస్తు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని వ్యవసాయాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాపాస్ పుస్తకం కలిగిన ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళలు అర్హులని, సబ్సిడీపై అందించే యంత్ర పరికరాలకు 29వ తేదీ వరకు కొడంగల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.



బొంరాస్‌పేట: మహిళా రైతుకు మంజూరు పత్రాలను అందజేస్తున్న నాయకులు

యంత్ర పరికరాల పంపిణీ

బొంరాస్‌పేట: మండలంలోని పలు గ్రామాల మహిళా రైతులకు ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించి ప్రోత్సహిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సముదాయ ఆవరణలో 58 యూనిట్లు రాయితీపై మంజూరైన తుంపరసేద్య పరికరాలను పంపిణీ చేశారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కరణం ప్రహ్లాదరావు, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఘణపురం వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం ఎంపీ నిధులతో ఘణపూర్‌లో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్థానిక సంస్థలకు నిధులు కేటాయించేది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించని పరిస్థితిలో, గ్రామాలు వెనుకబాటుకు గురవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కుల్కచర్ల బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, నాయకులు కాటనిపల్లి అంజిలయ్య, ఆంజనేయులు, రాంచంద్రయ్య, మహేశ్, చలివేంద్రం మహేష్, పాల్గొన్నారు.

సీఎం చొరవతో సీసీ రోడ్డు పనులు



బొంరాస్‌పేట: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామానికి కాంగ్రెస్ నేత తిరుపతిరెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని పార్టీ మండల, గ్రామ నాయకులు పేర్కొన్నారు. యేళ్ల తరబడి ఉన్న సమస్యలను గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిష్కారమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభారాణి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, బీసీ సెల్ అధ్యక్షుడు స్వామి మల్లేశ్, గ్రామ నాయకులు పని వెంకటయ్య, శ్రీశైలం, రాజేందర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, శాంతయ్య, పని యాదమ్మ పాల్గొన్నారు.

ప్రయాణికులకు చల్లటి తాగునీరు



కొడంగల్ రూరల్: బస్టాండులో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న సురేశ్‌కుమార్

కొడంగల్ రూరల్: బస్టాండులో ప్రయాణికులకు చల్లటి మంచినీరు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తాండూరు డిపో మేనేజర్ సురేశ్‌కుమార్, కొడంగల్ బస్టాండు కంట్రోలర్ పీఎస్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని బస్టాండులో ఆర్వో ప్లాంటును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతీ నిత్యం బస్టాండు రద్దీగా ఉంటుందని, ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పెరుగుతున్న ఎండలకు చల్లటి మంచినీరు తాగితే దప్పిక తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కంట్రోలర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

కుల్కచర్ల: వేసవి నేపథ్యంలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీఓ రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికులు, బాటసారులు, విద్యార్థులకు చలివేంద్రాలు దాహార్తిని తీరుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోశ్, స్థానిక నాయకులు చంద్రభూపాల్, షర్ఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో అభివృద్ధి

డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్



మాట్లాడుతున్న రవిగౌడ్

తాండూరు రూరల్: రైతుల సహకారంతో ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అభివృద్ధి చెందుతుందని డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ పేర్కొన్నారు. గురువారం పట్టణ సమీపంలోని ఎల్మకన్నె పీఏసీఎస్ కార్యాలయంలో సీఈఓ శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ..సహకార సంఘం నుంచి ప్రతీ రైతుకు రుణాలు మంజూరుచేస్తామన్నారు. అప్పులు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బంగారంపై రూ.22,20,00,000 రుణాలు అంద జేశామన్నారు. ప్రస్తుతం రూ.1,20,00,000లతో సంఘం లాభంలో ఉందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక రుణాలు 26 మంది రైతులకు సంబంధించి రూ.40లక్షలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే సగం వడ్డీ చెల్లించేందుకు సంఘం సహకరిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పీఏసీఎస్ పదవీకాలం మరో 6నెలలు పొడగింపుపై సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్, అదనపు సీఈఓ చంద్రారెడ్డి, డైరెక్టర్లు అమృతయ్య గౌడ్, రాఘవేందర్, వెంకట్రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, పార్వతమ్మ, అనంతమ్మ, పెంద్యా నర్సిములు, సిద్ధయ్యస్వామి, వడ్ల బిచ్చన్న, పన్నిబాయ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి బాధాకరం

దోమ: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోపాల్‌గౌడ్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం దోమ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు గోపాల్‌గౌడ్ గుండె పోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే స్థానిక బీఆర్ఎస్ నేతలతో వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల వెంకటనాగిరెడ్డి, లక్ష్మయ్య ముదిరాజ్, మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, గోపాల్‌గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఖాజపాషా పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

ఎస్‌బీఐ ట్రైనింగ్ డైరెక్టర్ రమేశ్

బంట్వారం: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చిలుకూరు ఎస్‌బీఐ ట్రైనింగ్ డైరెక్టర్ రమేశ్ పేర్కొన్నారు. గురువారం కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ రైతు వేదికలో ఉన్నతిలో భాగంగా మహిళలకు టైలరింగ్ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీలో 100రోజులు పని పూర్తి చేసిన మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రోజుకి రూ.200లు చెల్లించడంతో పాటు శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శివయ్య, టీజీబీ మేనేజర్ నరేందర్‌రెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, నిర్మల, శశికళ, సీసీలు గణేష్, సునీత, ట్రైనర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు సొసైటీ సర్వసభ్య సమావేశం

బంట్వారం: సహకార సంఘం సర్వసభ్య సమావేశం సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచెంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం11 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమౌతుందని, దీనికి డైరెక్టర్లు, సంఘం సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

◆ తైబజారు వేలం

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో ప్రతి శనివారం నిర్వహించే సంత తైబజారు వేలాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి స్వప్న పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం 1గంటకు వేలం నిర్వహిస్తారని తెలిపారు. రూ.10వేల డిపాజిట్‌తో వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

◆ దుకాణాల వేలం

తాండూరు రూరల్: పెద్దేముల్ గ్రామ పంచాయతీకి సంబంధించిన దుకాణ సముదాయాలను వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి ధీరజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనే వారు ఇంటి పన్ను, నల్లా బిల్లులు చెల్లించిన వారు అర్హులని తెలిపారు.

◆ బృందావన్ గార్డెన్‌లో ఇఫ్తార్

పరిగి: రంజాన్ పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో శుక్రవారం సాయంత్రం 6గంటలకు ఇఫ్తార్ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ మంత్రి పదవి కేటాయించాలి

కుల్కచర్ల: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి మంత్రి పదవి కేటాయించాలని కుల్కచర్ల మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేస్తూ, పార్టీతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అండగా ఉండి పనిచేశారని గుర్తు చేశారు.

◆ అంగన్‌వాడీ భవనం పరిశీలన

దుద్యాల్: మండల పరిధిలోని గౌరారంలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని పంచాయత్ రాజ్ డీఈ సుదర్శన్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సురేందర్ రెడ్డి, ఈఈ సత్యనారాయణ రెడ్డి, పులిందర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం అందజేత

బంట్వారం: కోట్‌పల్లి చర్చి ఫాస్టర్ ఇంటి నిర్మాణానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ గురువారం చర్చి సభ్యులకు రూ.25,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా చర్చి సభ్యులు అనిల్‌కు కృతజ్ఞత తెలిపారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం



కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేశారు. వికారాబాద్‌కు చెందిన నీల వెంకటరమణ రూ.1,51,000లు, హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ రూ.1,11,000లు, జహీరాబాద్‌కు చెందిన అల్లాడి రాధాకృష్ణ రూ.51,000లు, యాదగిరిగుట్టకు చెందిన ధరూర్ శ్రీనివాసాచార్యులు రూ.51,000లు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్ర యాదవ్, పి.శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, కిషన్‌ధాగ విరాళం తీసుకొని రసీదు ఇచ్చారు. ఇంకా దాతలు ఎవరైనా సహకరిస్తే ఆలయ నిర్మాణం తొందరగా పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నందారం మధు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్ఆర్ సేవలు అభినందనీయం



కొడంగల్: కంటి పరీక్షలు చేస్తున్న లయన్ హరినాథ్



తాండూరు రూరల్: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పట్లోళ్ల బాల్‌రెడ్డి

మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి

తాండూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఎల్ఎన్ఆర్ చేపడుతున్న సేవలు అభినందనీయమని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ..లొంక నర్సిములు యువసేన, హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో తాండూరు ప్రాంతంలో కంటి పరీక్షలు నిర్వహించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేని పేదలకు ఆపరేషన్ చేయించడం గొప్పవిషయమని కొనియాడారు. చెంగోల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించి 50 మందికి ఆపరేషన్ కోసం తీసుకెళ్లినట్లు ఎల్ఎన్ఆర్ యువసేన సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకుడు లొంక నర్సిములు, ఏఎంసీ డైరెక్టర్లు రాజు, తులసి రాథోడ్, నాయకులు రాము యాదవ్, హర్షవర్ధన్ రెడ్డి, హరిశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు

కొడంగల్: పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్, వాసన్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ వైద్య పరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉన్న 150 మందికి పరీక్షలు చేయగా అందులో 35 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. మిగిలిన వారికి బీపీ, షుగర్ ఇతర సమస్యలు ఉండడం వల్ల ఆపరేషన్ల కోసం ఎంపిక చేయలేదు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి కంటి వైద్యశాలకు ప్రత్యేక వాహనంలో తరలించినట్లు చెప్పారు. వారికి అక్కడ ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసిన అనంతరం వారిని తిరిగి కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి ఎవరి ఇండ్లకు వారిని పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు దాసప్ప యాదవ్, మునీర్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622